డిప్యూటీ కమిషనర్‌గా గోవర్ధన్



గోవర్ధన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ హైదరాబాద్ రూరల్ డివిజన్ జీడిమెట్ల సర్కిల్–1 అసిస్టెంట్ కమిషనర్ డి.గోవర్ధన్‌కు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి లభించింది. అబిడ్స్ పరిధిలో గగన్‌విహార్‌లో శుక్రవారం పదోన్నతి పొందిన డిప్యూటీ కమిషనర్ గోవర్ధన్‌ను సర్కిల్ ఉద్యోగులు, అధికారులు కిరణ్‌రెడ్డి, శ్రీకాంత్, నజీర్, శ్రీధర్‌రావు, గురుకిరణ్, జమీర్, సంపత్, యాదగిరిలు సన్మానించారు.

వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి



గోల్కొండ: వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం నానల్‌నగర్, టోలిచౌకీ, గోల్కొండ డివిజన్లలో ఆయన పర్యటించారు. వర్షపు నీరు రోడ్లపై ప్రవహించడం, నాలాలు పొంగిపొర్లడం గమనించారు. వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి మాన్సూన్ రెస్క్యూ టీమ్‌లను రప్పించారు. బుల్కాపూర్ నాలా టోలిచౌకీ చౌరస్తా, నదీమ్ కాలనీ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నిలిచిన వరద నీటిని ఆయన వెంటవెంటనే తరలింపజేశారు.

భక్తిశ్రద్ధలతో మహా పూర్ణాహుతి



మహా పూర్ణాహుతి పూజల్లో గాజుల అంజయ్య తదితరులు

చార్మినార్: మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో 21 రోజులుగా కొనసాగిన రుద్ర సహిత త్రి శతచండి మహాయాగం శుక్రవారం పరిసమాప్తి అయింది. శుక్రవారం మహా పూర్ణాహుతి వైభవంగా జరిగింది. పసుపు, కుంకుమలతో పాటు 108 రకాల ఆయుర్వేద ఔషధాలు, సుగంధ ద్రవ్యాలతో అమ్మవారికి శత ఔషధీయుక్త మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తగిన ఏర్పాట్లు చేశారు. పూర్ణాహుతిలో కాట రమేష్ దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. మల్యాల మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, కోటిరెడ్డి, మల్లేష్‌యాదవ్, కొడి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



అరవింద్‌రెడ్డిని సన్మానిస్తున్న క్రాంతికుమార్ యాదవ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: వాణిజ్య పన్నుల శాఖ వీహెచ్‌పీ మాదాపూర్ డివిజన్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అరవింద్‌రెడ్డిని తెలంగాణ వాణిజ్యపన్నుల శాఖ టీఎన్జీఓ హైదరాబాద్ రూరల్ డివిజన్ అధ్యక్షుడు క్రాంతికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సభ్యులు కిరణ్‌రెడ్డి, నందు, కర్ణాకర్, అరుణ్, కృష్ణ, శివానంద, చారి, షాకీర్, శ్రీకిరణ్ తదితరులు పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న అరవింద్‌రెడ్డిని జీఎస్టీ పలు సర్కిళ్ల అసిస్టెంట్ కమిషనర్లు, డీసీటీఓ, ఏసీటీఓలు శుభాకాంక్షలు తెలిపారు.

కూలిన సీఆర్‌పీఎఫ్ ప్రహరీ..తప్పిన ముప్పు

చాంద్రాయణగుట్ట: పాతబస్తీలో శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి చాంద్రాయణగుట్టలోని సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ ప్రహరీ గోడ కూలింది. ఆ సమయంలో గోడ పక్కన ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బండ్లగూడ రాజీవ్‌గాంధీ నగర్ వైపు ముబారక్ ఫంక్షన్ హాల్ ముందు సాయంత్రం 4.19 గంటలకు భారీ వర్షం కురుస్తున్న సమయంలో దాదాపు 30 ఫీట్ల పొడవు వరకు ఒక్కసారిగా గోడ కూలింది. కూలిన గోడ పక్కకు స్వల్ప దూరంలో ఇన్నోవా కారు వెళ్లినప్పటికీ, శిథిలాలు కారుపై పడకపోవడంతో కారులో ఉన్న వారు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని కూలిన తీరును పరిశీలించారు. గోడ కింది నుంచి వర్షపు నీరు వెళుతున్న కారణంగానే కూలినట్లు తెలిసింది. గతంలో కూడా ఒకసారి ఈ గోడ కూలిందని స్థానికులు వెల్లడించారు.

వీధి కుక్కల బెడద లేకుండా పకడ్బందీ చర్యలు

బస్తీల్లో 24/7 కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్

- ముమ్మరంగా డాగ్ స్టెరిలైజేషన్ చికిత్సలు
- ఇప్పటికే 80 శాతం వరకు వ్యాక్సినేషన్
- జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి



చార్మినార్: బోనాలు ఉత్సవాల పురస్కరించుకొని పాతబస్తీలో వీధి కుక్కల బెడద లేకుండా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ వెటర్నరీ విభాగం డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. తమ పరిధిలో డాగ్ స్క్వాడ్ (క్యాచర్స్) బృందాలు బస్తీల్లో తిరుగుతూ వీధి కుక్కల కట్టడికి కృషి చేస్తున్నామన్నారు. యాంటీ రాబిస్ వ్యాక్సిన్స్ వేసి కట్టడి చేస్తున్నామన్నారు. మా పరిధిలోని వీధి కుక్కలకు 80 శాతం వరకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశామన్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన వివరాలు వెల్లడించారు.

మీ పరిధిలో ఎన్ని సర్కిల్స్ ఉన్నాయి?

మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, బహదూర్‌పురా, రాజేంద్రనగర్ ఇలా ఆరు జీహెచ్‌ఎంసీ సర్కిల్స్ ఉన్నాయి.

వీధి కుక్కల బెడద తగ్గించడానికి మీరు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

మా సిబ్బందిని రెండు షిఫ్టుల్లో అప్రమత్తంగా ఉంచాం. ఎక్కడ భక్తులకు కుక్కల బెడద లేకుండా తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నాం.

ఎంత మంది సిబ్బంది ఉన్నారు..? ఎవరెవరు..?

నాతో పాటు ఒక అడిషనల్ డైరెక్టర్, ముగ్గురు వెటర్నరీ ఆఫీసర్లలతో పాటు 68 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నాలుగు పారా వెటర్నరీ సిబ్బంది ప్రతిరోజు విధి నిర్వహణలో ఉంటారు.

టోల్ ఫ్రీ నెంబర్ ఎంత..?

040–21111111

ఎనిమల్ కేర్ సెంటర్ ఎక్కడుంది?

చుడిబజార్‌లో

బోనాల సందర్భంగా ప్రత్యేకంగా తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

సిబ్బందిని 24/7గా..అందుబాటులో ఉంచాం. ఉదయం 6:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక షిఫ్ట్..మధ్యాహ్నం 3 నుంచి రాత్రి 11 గంటల వరకు మరో షిఫ్ట్ పద్ధతిలో డాగ్ క్యాచర్స్ బృందాలు పనిచేస్తున్నాయి.

బోనాల పండుగ సందర్భంగా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

ప్రజలకు స్వచ్ఛమైన మాంసాన్ని అందించే దిశగా దుకాణదారులను అప్రమత్తం చేస్తున్నాం. ఎక్కడైనా అపరిశుభ్రంగా కనిపిస్తే కేసులు సైతం నమోదు చేస్తున్నాం.

ఇప్పటి వరకు నమోదైన కేసులు, చలాన్ల వివరాలు చెప్పండి.

గత ఏప్రిల్ నుంచి జూలై వరకు 26 కేసులు నమోదు చేసి 55 కిలోల మాంసాన్ని స్వాధీనం చేసుకున్నాం. అలాగే 45 దుకాణాల యజమానులకు చలాన్లు వేసి..వారి వద్ద నుంచి రూ.82,200 జురుమానా వసూలు చేశాం. ఇక 1720 కిలోల బీఫ్ మాంసాన్ని స్వాధీనం చేశాం.

గ్రామ దేవతగా..ధూల్‌పేట మహంకాళి

- వందేళ్లకు పైగా నిత్యం పూజలందుకుంటున్న మహంకాళి అమ్మవారు
- 20న సామూహిక బోనాల సమర్పణ
- ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయ నిర్వాహకులు



మహంకాళి అమ్మవారు

జియాగూడ: ధూల్‌పేట ప్రజల గ్రామదేవతగా వందేళ్లకు పైగా మహంకాళి అమ్మవారు నిత్యం పూజలు అందుకుంటూ భక్తులు కోరిన కోర్కెలను నెరవేరుస్తూ కొంగు బంగారంగా నిలిచింది. ఇక ప్రతియేటా బోనాల జాతర, దసరా శరన్నవరాత్రి వేడుకలు, ఉగాది నవరాత్రి వేడుకలను మహంకాళి ఆలయ ట్రస్ట్ బోర్డు ప్రతినిధులు ఘనంగా నిర్వహిస్తున్నారు.

బోనాల వేడుకల బ్రోచర్ విడుదల..

ధూల్‌పేట్ మహంకాళి ఆలయ బోనాల వేడుకల బ్రోచర్‌ను ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ వెంగాళ రవీందర్, వైస్ చైర్మన్ దండు శ్యామ్, ప్రధాన కార్యదర్శి బ్రిజ్‌మోహన్, కోశాధికారి ఏనుగుల మాణిక్‌ప్రభు,



బ్రోచర్ విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సభ్యులు వెంగాళ వెంకట్, దీపాల డి.దుర్గేష్, జె.పాండు తదితరులు శుక్రవారం ఆలయంలో విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సుమారు వందేళ్లకు పైగా బోనాలను నిర్వహిస్తున్నారన్నారు. 20న సామూహిక బోనాల సమర్పణ, ఇతర వేడుకలు కొనసాగుతాయన్నారు.

కొనసాగుతున్న ఏర్పాట్లు..

ధూల్‌పేట్ మహంకాళి ఆలయంలో బోనాల వేడుకల కోసం ఏర్పాట్లు జోరుగా కొనసాగుతున్నాయి. 15 రోజుల నుంచి చేపట్టిన రంగులద్దే పనులతో పాటు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యులు తెలిపారు.

లాల్‌దర్వాజా బోనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారికి హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి శుక్రవారం బంగారు బోనం సమర్పించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. బోనం సమర్పించిన అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కుంకుమార్చనలో పాల్గొన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..లాల్‌దర్వాజా మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించి, కుంకుమార్చనలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆదివారం జరిగే బోనాలకు ఇప్పటికే అన్ని శాఖలు సన్నద్ధంగా ఉన్నాయని, సెక్యూరిటీ, తాగునీరు, కంట్రోల్



బంగారు బోనం తీసుకొస్తున్న కలెక్టర్ హరిచందన

రూమ్, సరిపడా సిబ్బంది అందుబాటులో ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బండ్లగూడ తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆలయ కమిటీ కన్వీనర్ జి.అరవింద్‌కుమార్ గౌడ్, మాజీ చైర్మన్ కె.వెంకటేష్, కోశాధికారి ఎ.చంద్రకుమార్, సాంస్కృతిక కార్యదర్శి వినోద్ పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన



లక్డీకాపూల్ మెట్రో రైల్వే స్టేషన్ కింద నిల్చున్న ద్విచక్ర వాహనదారులు



హనుమాన్ నగర్ ప్రధాన రోడ్డులో..

చార్మినార్: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పాతబస్తీలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రోడ్లు సైతం వరదనీటితో మునిగిపోవడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు స్తంభించాయి. డబీర్‌పురా, శివలింగంగానగర్, రాజన్న బావి, ఛత్రినాక చౌరస్తా, అచ్చయ్య నగర్, హనుమాన్‌నగర్, అంబికానగర్, పటేల్‌నగర్ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇళ్లలోకి వరద నీరు చేరడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

నాంపల్లిలో..

నాంపల్లి: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. నాంపల్లిలోని మురికివాడలు అఫ్జల్ సాగర్, మాంగారు బస్తీ, హబీబ్‌నగర్, జవహర్‌నగర్‌లలో ఇళ్లలోకి నీరు వచ్చి చేరాయి. మాసబ్ ట్యాంక్, బంజారాహిల్స్, లక్డీకపూల్ ప్రాంతాల నుంచి వరద నీరు లోతట్టు ప్రాంతాలకు వచ్చి చేరింది. వరద నీటితో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సైబర్ మోసాలపై అవగాహన కల్పించాలి

చార్మినార్: సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సైబర్ క్రైమ్ సౌత్ జోన్ ఎస్‌ఐ భిక్షం అన్నారు. శుక్రవారం పురానీహవేలీలోని డాన్ హైస్కూల్‌లో సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భిక్షం అధ్యక్షత వహించగా, కానిస్టేబుల్ సంయుక్త ముఖ్యవక్తగా పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ..ఆన్‌లైన్ గేమ్స్, వర్క్ ఫ్రం హోం ఆఫర్లు, డిజిటల్ అరెస్ట్ లాంటి నకిలీ స్కామ్‌ల ద్వారా అమాయకులను మోసగాళ్లు లక్ష్యంగా పెట్టుకొని మోసాలకు పాల్పడుతున్నారని సూచించారు. సైబర్ మోసాల బారిన పడినవారు వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1930కు ఫోన్ చేయాలన్నారు. ప్రధానోపాధ్యాయురాలు ఆశు ఖన్నా, అడ్మినిస్ట్రేటర్ నర్గిస్, షజీయుల్లా ఫిరాసత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల చదువు సమాజానికి వెలుగు

గోల్కొండ: బాలికల చదువు సమాజానికి వెలుగులాంటిదని గోల్కొండ బీజేఆర్ ప్రభుత్వ బాలికల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మాధవి అన్నారు. కళాశాలలో ప్రవేశం పొంది తరగతులకు హాజరుకాని విద్యార్థులను మళ్లీ కళాశాలకు పంపాలని ఆమె శుక్రవారం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కళాశాల అధ్యాపకులతో ఆమె తరగతులకు హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె వారికి బాలిక చదువుకు ఉన్న ప్రాధాన్యం, ఆవశ్యకత తదితర విషయాలపై అవగాహన కల్పించారు.

గ్రంథావిష్కరణ

సుల్తాన్‌బజార్: ఆంగ్ల భాష గురించి గొప్పలు చెప్పుకుంటున్నా.. ఆ భాష మాట్లాడేవారు ఈ నాటికి అల్ప సంఖ్యాకులేనని మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు అన్నారు. శాంతవసంత ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో జరిగిన ఆచార్య అనుమాన్ల భూమయ్య రచించిన డాక్టర్ సి.నారాయణరెడ్డి కథాకావ్య సమాలోచన గ్రంథావిష్కరణ సభలో విద్యాసాగర్‌రావు పాల్గొని గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ..తెలుగు భాష గొప్పదనాన్ని ఈ తరానికి పరిచయం చేయడానికి విరివిగా సాహిత్య కార్యక్రమాలు జరగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పరిషత్ అధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, జీవీ.శంకర్‌రావు, అనుమాన్ల భూమయ్య, డాక్టర్ జె.చెన్నయ్య పాల్గొన్నారు.



బందోబస్తు ఏర్పాట్ల పరిశీలన

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి ఆలయంలో ఆదివారం జరిగే బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని దక్షిణ మండలం డీసీపీ స్నేహ మెహ్రా బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ అధికారులు, కమిటీ ప్రతినిధులతో కలిసి ఆలయ పరిసరాల్లో కలియ తిరుగుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల దారి మళ్లింపు, వీఐపీల వాహనాల రూట్ విషయాలపై ట్రాఫిక్ ఏసీపీ లక్ష్మణ్‌తో సమాలోచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..ఆదివారం జరిగే బోనాల కోసం ఇప్పటికే ఆర్ అండ్ బి, జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌శాఖ, ఆలయ కమిటీ ప్రతినిధులతో సమావేశం కావడం జరిగిందన్నారు. మహిళా భక్తుల కోసం షీ టీమ్స్, స్వాడ్ మహిళా క్విక్ రెస్పాన్స్ టీమ్‌లు, మహిళా



బందోబస్తు ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీసీపీ స్నేహ మెహ్రా

కానిస్టేబుళ్లు, క్రైం టీమ్స్ అందుబాటులో ఉంటారన్నారు. ఆమె వెంట ఆలయ కమిటీ చైర్మన్ మారుతీ యాదవ్, దక్షిణ మండలం అదనపు డీసీపీ మజీద్, ఛత్రినాక ఏసీపీ సీహెచ్ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్ర ప్రసాద్‌వర్మ, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రావు తదితరులున్నారు.

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం



కిషన్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్లు, మాజీ డిప్యూటీ మేయర్



డిప్యూటీ సీఎంకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

గౌలిపురా: గౌలిపురాలోని మహంకాళి మాతేశ్వరి భరతమాత, కోట మైసమ్మ ఆలయంలో నిర్వహించే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఆలయ కమిటీ ప్రతినిధులు కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎర్మనీ కైలాష్ గంగపుత్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ఎస్.ఆనంద్ రావు, ముఖ్య సలహాదారులు కె.జ్ఞానేశ్వర్ ముదిరాజ్, ఉపాధ్యక్షులు బి.వై.శ్రీకాంత్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి..

పాతబస్తీలో ఈ నెల 20, 21వ తేదీల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని కోరుతూ శుక్రవారం కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డిని మాజీ కార్పొరేటర్లు ఆలే జితేంద్ర, సహదేవ్ యాదవ్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జీ, బీజేపీ గౌలిపురా డివిజన్ అధ్యక్షులు ఇ.సుమన్ కుమార్ ముదిరాజ్‌లు కలిసి ఆహ్వానపత్రాన్ని అందజేశారు.

సాంస్కృతిక కార్యక్రమాలను యథావిధిగా నిర్వహించాలి



వీహెచ్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రాంతికుమార్

యాకుత్‌పురా: బోనాల సందర్భంగా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలను యథావిధిగా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంత్‌రావు దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్‌రావును కోరారు. పాతబస్తీలోని వివిధ ఆలయాల వద్ద కేటాయించిన కార్యక్రమాలు రద్దయినట్లు కళాకారులకు సమాచారం అందడంతో శుక్రవారం వారు పాతబస్తీ ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.పి క్రాంతికుమార్ వివరించగా కళాకారులు బృందాలతో కలిసి ఆయన వీహెచ్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన వీహెచ్ బోనాల ఉత్సవాల నేపథ్యంలో కార్యక్రమాలు నిర్వహించాలని దేవాదయ శాఖ కమిషనర్‌ను కోరారని క్రాంతికుమార్ తెలిపారు.

జితేందర్‌రెడ్డికి సత్కారం

అబిడ్స్: వాణిజ్య పన్నుల శాఖ జీఎస్టీ సికింద్రాబాద్ డివిజన్ జాయింట్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇ.జితేందర్‌రెడ్డిని తెలంగాణ వాణిజ్యపన్నుల శాఖ టీఎన్జీఓస్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్షుడు సందీప్‌కుమార్, కార్యదర్శి ఆదిత్య, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభుదాస్, ఉపాధ్యక్షులు సుజాతారెడ్డి సత్కారం చేసి అభినందనలు తెలిపారు. డివిజన్ పరిధిలోని పలు సర్కిళ్ల అసిస్టెంట్ కమిషనర్లు, డీసీటీఓలు, ఏసీటీవోలు ఇతర అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



అలరించిన యాదాద్రి జాతీయ నృత్యోత్సవం



గన్‌ఫౌండ్రీ: కళాకృతి నృత్యాలయ ది డ్యాన్స్ ఇండియా మ్యాగజిన్‌ల సంయుక్తాధ్వర్యంలో రెండు రోజులుగా రవీంద్రభారతిలో జరుగుతున్న యాదాద్రి జాతీయ నృత్యోత్సవం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా రాష్ట్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి జేయేష్ రంజన్ మాట్లాడుతూ..వివిధ కళారూపాయాలను ఒకే వేదికపై ప్రదర్శించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం పద్మశ్రీ పురస్కార గ్రహీత ఉమామహేశ్వరీ, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ దంపతులకు యాదాద్రి జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేయగా తమిళనాడుకు చెందిన భరతనాట గురువు అనిత గుహ కూచిపూడి కళాకారిణి అనుపమ మోహన్‌కు యాదాద్రి ఎక్సలెన్సీ అవార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఎల్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మను కోరుల్లా, కళాకృతి నృత్యాలయ వ్యవస్థాపకులు ఎం.భారతి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు చెల్లించాలి

నాంపల్లి: ఫీజు బకాయిలను చెల్లించాలని కోరుతూ గురుకుల కళాశాలల విద్యార్థులు శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. బీసీ గురుకుల పాఠశాలల్లో 20 శాతం సీట్లు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సంఘీభావం ప్రకటించి ప్రసంగించారు. అభివృద్ధి పథకాల కోసం లక్షల కోట్లు అప్పు తెస్తున్న ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే ఫీజు బకాయిలు, ఉపకారవేతనాల కోసం రూ.6 వేల కోట్లు అప్పు తెస్తే ఎవరు అడ్డుకుంటారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఫీజు బకాయిలు చెల్లించడానికి రూ.20 కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఫీజులు చెల్లించని కారణంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, సర్టిఫికెట్లు లేకపోవడంతో విద్యార్థులు ఉద్యోగాలు కూడా పొందలేకపోతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నేతలు రాజేందర్, భూపేష్, చంద్రాగౌడ్, స్వామి గౌడ్, భాస్కర్, నిఖిల్, శివ, నరేష్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.



సంక్షేమ భవన్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు



బోనాల ఉత్సవాల్లో భాగంగా లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయ శిఖర హారతి కార్యక్రమం శుక్రవారం రాత్రి కనుల పండువగా కొనసాగింది. వేలాది మంది మహిళా భక్తులు హాజరై శిఖరానికి ఒకేసారి హారతి ఇవ్వడంతో ఆధ్యాత్మికత ఉట్టిపడింది.
–చాంద్రాయణగుట్ట

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



సింహవాహినికి చేనేత ఇక్కత్ పట్టుచీరను తీసుకొస్తున్న కార్పొరేటర్ పావనీ తదితరులు



గోషామహల్ ఫలహారం బండి ఊరేగింపులో బీజేపీ నాయకుడు లక్ష్మణ్‌రావు



పూజలు చేస్తున్న ఆలయ కోశాధికారి బొడ్డు సాయిబాబా తదితరులు

అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, హోమాలు, కుంకుమార్చనలు చేశారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాల నడుమ అమ్మవార్లకు బోనాలు, పట్టు వస్త్రాలు, ఘటాలను సమర్పించారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.
– అబిడ్స్, చార్మినార్, మెహిదీపట్నం జోన్ల బృందం



మహంకాళికి బోనం తీసుకెళ్తున్న మాధవీలత



కిషన్‌గంజ్ బోనాల వేడుకల్లో మమతాగుప్తా, సంతోష్‌గుప్తా, ధన్‌రాజ్, నరేందర్ యాదవ్



దర్బార్ మైసమ్మకు పట్టు వస్త్రాల పట్టువస్త్రాల ఊరేగింపులో మంత్రి వివేక్ తదితరులు



బోనాలతో సరస్వతి విద్యానికేతన్ హై స్కూల్ విద్యార్థులు



బోనాలు ధరించిన విశ్వభారతి స్కూల్ విద్యార్థులు